క్లుప్తంగా

చిన్నారులకు నృత్య పోటీలు



సమ్మర్ క్యాంపులో నృత్యం చేస్తున్న చిన్నారులు

తాళ్లరేవు: స్థానిక చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో నాలుగో రోజైన బుధవారం చిన్నారులకు నృత్య పోటీలు నిర్వహించారు. శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య, నృత్యాలను ప్రదర్శించి విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ పోటీలకు వెదురుపావులూరు నాని, అనంతలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జగన్నాథరాజు స్పోకెన్ ఇంగ్లిష్‌లో మెళకువలు నేర్పించారు. చిన్నారులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గుత్తుల మల్లేశ్వరరావు తెలిపారు.

ఆపదలో ఆదుకున్నారు



రక్తదానం చేస్తున్న సూరిబాబు

అమలాపురం టౌన్: ఓ గుండె వ్యాధి రోగికి అత్యవసర శస్త్రచికిత్స నిమిత్తం అరుదైన 'ఓ' పాజిటివ్ రక్తం అవసరం కాగా స్థానిక ఆజాద్ ఫౌండేషన్ సమకూర్చింది. వడ్లమూడి వెంకటలక్ష్మి అనే మహిళకు బుధవారం స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్స కోసం 'ఓ' పాజిటివ్ రక్తం అవసరమైంది. దీనిపై స్పందించిన ఆజాద్ ఫౌండేషన్ సభ్యుడు దంగేటి వెంకటరమణ తన మిత్రుడు సీహెచ్ సూరిబాబును కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి అతని చేత రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు దంగేటి వెంకటరమణను, రక్తదానం చేసిన సూరిబాబును ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధాకొండ అభినందించారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ భీమారావు

అమలాపురం రూరల్: పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు రెండో విడత పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎంఏకే భీమారావు సూచించారు. అమలాపురం మండలానికి సంబంధించి నాడు- నేడు పనుల ప్రగతిపై ప్రధానోపాధ్యాయులకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏపీసీ భీమారావు ఏయే పాఠశాలల్లో పనులు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో సరెళ్ల కృష్ణవేణి, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రెహమాన్, స్కూల్స్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

యానాం: స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఉమ్మడి విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం వినియోగదారుల నుంచి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మీటర్ల మార్పు, లోఓల్టేజీ, హైఓల్టేజీ తదితర సమస్యలపై పలువురు ఫిర్యాదు చేశారు. సోషల్ యాక్టివిస్ట్ సబ్బతి శ్రీనివాసరావు దరియాలతిప్ప గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందించారు. తీరంలో గాలులకు తరచూ గంటల తరబడి విద్యుత్ అంతరాయం కలుగుతుందని, గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జితేంద్రరావు, ఏఈ లంక కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి ఆశ్రమాన్ని సందర్శించిన కొండవీటి జ్యోతిర్మయి



బాలయోగీశ్వరుల దివ్య సమాధుల వద్ద కొండవీటి జ్యోతిర్మయి

ముమ్మిడివరం: ప్రముఖ సంగీత విద్యాంసురాలు, అమ్మ కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు చైర్మన్ కొండవీటి జ్యోతిర్మయి బుధవారం ముమ్మిడివరం శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమాన్ని సందర్శించారు. బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించి పూజలు చేశారు. అనంతరం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో పెన్మత్స జగ్గప్పరాజు, బాలయోగీశ్వరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు ఖరీఫ్‌కు ముంపే ప్రతిబంధకం

- ప్రధాన డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడిక
- ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు



మొగళ్లమూరు వద్ద పూడికతో నిండిపోయిన లోయర్ కౌశిక



చెత్తా చెదారంతో దర్శనమిస్తున్న కూనవరం మేజర్ డ్రెయిన్

అల్లవరం: ప్రకృతి వైపరీత్యాల నుంచి ఖరీఫ్ పంటను దక్కించుకోవాలంటే ఖరీఫ్‌లో ముందస్తు నాట్లకు రైతులు సిద్ధం కావాల్సి ఉంది. అయితే ఖరీఫ్‌లో రైతులు ముందస్తు వరి నాట్లు వేయాలంటే ముంపే ప్రధాన సమస్యగా కనిపిస్తుంది. కొద్దిపాటి వర్షానికే ప్రధాన డ్రెయిన్లు నదులను తలపిస్తున్నాయి. మేజర్, మీడియం, మైనర్, రెవెన్యూ డ్రెయిన్ల నిండా పూడిక పేరుకుపోవడంతో ముంపు ఏర్పడుతుంది. డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ముంపు నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకోవడంతో రైతుకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతుంది. దీంతో అన్నదాతలంతా ఆందోళనకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ప్రధాన డ్రెయిన్ల పరిధిలో 34 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రెవెన్యూ, మైనర్, మీడియం డ్రెయిన్ల నుంచి ప్రధాన డ్రెయిన్‌లోకి చేరిన ముంపు నీరు కుమ్మరికాలువ, లోయర్ కౌశిక, కూనవరం, వాసాలతిప్ప డ్రెయిన్ల గుండా ముంపు నీరు సముద్రానికి చేరాల్సి ఉంటుంది. అయితే అల్లవరం మండలంలోని మొగళ్లమూరు నుంచి సామంతకుర్రు వరకూ విస్తరించి ఉన్న లోయర్ కౌశిక పూడికతో నిండిపోయింది. తాడికోన నుంచి కోడూరుపాడు వద్ద కుమ్మరికాలువలోకి కలుస్తున్న దేశికోడు డ్రెయిన్‌లో గడ్డి, తూటు విపరీతంగా పెరిగిపోయి చుక్క నీరు దిగే మార్గం కరవైంది. ఉప్పలగుప్తం మండలంలోని రాచకోడు, పాయకరావు కోడు, గొరగనమూడి డ్రెయిన్, అమలాపురం మేజర్ డ్రెయిన్ పూడికతో నిండిపోయాయి. ప్రధాన డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తే గాని ముంపునకు మోక్షం లభించదు.

కార్యాచరణ ముందుకు సాగేనా?

ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్‌కు సిద్ధమవడంతో డ్రెయిన్ శాఖ ముంపు సంస్య పరిష్కరించడానికి కార్యాచరణ చేపట్టింది. అల్లవరం మండలంలోని 17 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్న లోయర్ కౌశిక, 6 కిలోమీటర్ల పొడవునా దేశికోడు డ్రెయిన్‌లో పూడిక తీసేందుకు ప్రతిపాదనలు చేశారు. ఉప్పలగుప్తం మండలంలోని కూనవరం డ్రెయిన్‌కు ఎర్త్ వర్కు చేసేందుకు, మైనర్ డ్రెయిన్లు రాచకోడు, పాయకరావుకోడు, గొరగనమూడి డ్రెయిన్‌లో పూడిక తీయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు. నిధులు మంజూరైతే వెంటనే పూడికతీత పనులు చేపట్టి ఖరీఫ్‌లో ముంపు బెడద లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని డ్రెయిన్ అధికారులు చెబుతున్నారు. గతేడాది అల్లవరం మండలంలో చుంచులా, బెండా నార్త్, శిరగట్లపల్లి డ్రెయిన్లు అమలాపురం-అల్లవరం మండలాల్లో విస్తరించి ఉన్న సంఘం పుంత డ్రెయిన్లను ఆధునీకరించారు. ఉప్పలగుప్తం మండలంలో రంగరాజు కోడు, కూనవరం మేజర్ డ్రెయిన్‌లో కొంత భాగం, నార్త్ పీకలేరులను ఆధునీకరించి కూనవరం, రామేశ్వరం మొగలను ఓపెన్ చేసి ముంపు తీవ్రతను తగ్గించారు. రైతులు ఖరీఫ్‌కు సిద్ధమయ్యే నాటికి లోయర్ కౌశిక, దేశికోడు, కూనవరం ప్రధాన డ్రెయిన్‌లో పూడికను తొలగిస్తే పూర్తి స్థాయిలో ముంపు నుంచి రైతులకు మోక్షం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే మే నెలాఖరుకు చేరుకోవడం, ఇంకా నిధులు విడుదల కాకపోవడం చూస్తుంటే పూడిక తీత పనుల కార్యాచరణ ముందుకు సాగుతుందో లేదోనని రైతు సంఘాల నాయకులు సందేహం వెలిబుచ్చుతున్నారు.

> **ప్రతిపాదనలు పంపించాం**
>
> అల్లవరంలో లోయర్ కౌశిక, దేశికోడు డ్రెయిన్‌లో పూడిక తీసేందుకు, ఉప్పలగుప్తంలో కూనవరం మేజర్ డ్రెయిన్‌లో ఎర్త్ వర్కు చేసేందుకు, అన్ని మైనర్ డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించాం. ఆయా పనులకు నిధులు మంజూరైతే పూడికతీత పనులు వేగంగా పూర్తి చేసి ముంపు సమస్య పరిష్కరిస్తాం.
>
> – సునీతాదేవి, డ్రెయిన్స్ ఏఈ, అమలాపురం

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మాధవి తదితరులు

తాళ్లరేవు: మహిళలు నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ వంజరాన మాధవి తెలిపారు. వరల్డ్ మెన్‌స్ట్రువల్ హైజీన్ డేను పురస్కరించుకుని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర బాలికలు, తల్లులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం వారితో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే వచ్చే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. నెలసరి సమయంలో మహిళలను అంటరాని వారిగా చూడడం సరికాదన్నారు. ఇలాంటి సమయంలో మహిళలు, కిశోర బాలికలకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రెడ్డి సన్యాసిరావు, ఐసీడీఎస్ అధికారి లలిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రేపు నగర పంచాయతీ సమావేశం

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ జి.వెంకటరెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం జిల్లా డైరెక్టర్ సురేష్

అల్లవరం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి అల్లవరం మండల రిసోర్సు కార్యాలయంలో బుధవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ కిరణ్‌బాబు అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమానికి మధ్యాహ్న భోజన పథకం జిల్లా డైరెక్టర్ ఎస్.సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన భోజనం తయారు చేసి వడ్డించాలన్నారు. విద్యార్థులందరూ భోజనం తినేలా రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేయాలన్నారు. మన ఇంట్లో మన పిల్లల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో అదే రీతిలో విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, మౌనిక, సౌజన్య, డి.వరలక్ష్మి, ఎంఈఓ-2 ఏడుకొండలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడిలో మెగా వైద్య శిబిరం

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడి క్షత్రియ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో గ్లోబల్ ఫౌండేషన్ ఐఎన్‌సీ, అమలాపురం లయన్స్ క్లబ్, కిమ్స్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో హైపర్ టెన్షన్ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ అధినేత చైతన్యరాజు ముఖ్య అతిథిగా హాజరైన ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ పీఎస్ శర్మ, నడింపల్లి వెంకటరామరాజు, సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, ఎంపీటీసీ సభ్యురాలు పరమట నాగమణి, జంపన సుమన్ వర్మ, జీవీఎస్ మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లోకి ఆక్వా జలాలు



ఉప్పుమయంగా మారిపోయిన గుండెపూడి కాలువ

అల్లవరం: మండలంలోని ప్రధాన కాలువలైన గుండెపూడి, సామంతకుర్రు కాలువలోకి ఉప్పునీటిని వదిలేస్తున్నారు. రొయ్యల చెరువుల నుంచి డ్రెయిన్లలోకి మళ్లించాల్సిన ఉప్పు జలాలను సాగునీరు ప్రవహించే కాలువలోకి వదిలేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మే నెలలో రొయ్యల పంటను హార్వెస్టింగ్ చేసి మార్కెట్ చేస్తారు. రొయ్యలను హార్వెస్ట్ చేసిన తర్వాత చెరువుల్లోని ఉప్పు నీటిని మోటార్లతో దిగువకు తోడేస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయిన్‌లో వర్షం నీరు స్తంభించి ముంపు సమస్య ఏర్పడింది. దీంతో ఆక్వా రైతులు పంపింగ్ చేస్తున్న ఉప్పు జలాలు దిగువకు వెళ్లే మార్గం కరవై డ్రెయిన్ల నుంచి కాలువల్లోకి ఎదురెక్కుతుంది. శివారు ప్రాంతాల్లోని కాలువల్లో ఎటూ చూసినా ఉప్పు నీరే దర్శనమిస్తుంది. ఇంతర జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలు రేగుతున్నాయి. ప్రతి కాలువకి చెక్ డ్యామ్‌లు అందుబాటులో ఉన్నా వాటిని కిందకు దించి ఉప్పునీరు ఎగువకు రాకుండా నిలువరించలేకపోతున్నారు. ఉప్పు నీరు రాకుండా చెక్ డ్యామ్‌లతో నియంత్రించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉప్పునీరు రాకుండా చర్యలు తీసుకుంటే ఖరీఫ్‌కు నారుమళ్లు వేసేందుకు అవకాశం ఉంటుందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

వేంకటేశ్వరస్వామికి గజ వాహన సేవ



బండారులంకలో వేంకటేశ్వరస్వామిని గజ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు సమర్పించారు. తొలుత ఆలయ అర్చకులు భీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో లక్కింశెట్టి పుల్లేశ్వరావు, బేబీ వెంకట త్రిపుర సుందరి దంపతులచే స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, శ్రీనివాసా బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం పెదరాజు, బిళ్ల విశ్వేశ్వరరావు, బుట్టే శేఖర్, బల్ల సాయి, కుర్మా క్రీస్తు, ఎం.దుర్గాప్రసాద్, ఎం.తిలక్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చల్లపల్లిలో పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఉప్పలగుప్తం: పాడిరైతులు పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అవసరమైతే పశువైద్యులను సంప్రదించాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. మండలంలోని చల్లపల్లి పశువుల ఆసుపత్రి వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని డాక్టర్ వెంకటరావు, ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు బి.నాగేశ్వరరావు సందర్శించారు. శిబిరంలో పశువైద్యాధికారులు డాక్టర్ ఎం.నిరోషా, డాక్టర్ ఆకుల రమేష్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కేవీ రామారావు, పశుసంవర్ధక సంచాలకులు గొలకోటి గాంధీ పశువులకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 52 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి 84 పశువులకు గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర నిమ్మకాయల కృష్ణ, సిబ్బంది అక్కల ప్రదీప్, షకీలా బేగం పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈఓ తిళ్లైవేలు పర్యటన



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ తిళ్లైవేలు

యానాం: పుదుచ్చేరి డిప్యూటీ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ తిళ్లైవేలు బుధవారం యానాంలో పర్యటించారు. యానాం నియోజకవర్గ ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ వచ్చే నెల 4న జరగనున్న నేపథ్యంలో స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి వీవీ ప్యాట్‌ల లెక్కింపు విధానం గురించి వివరించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు పుదుచ్చేరిలో ప్రధాన ఎన్నికల కార్యాలయానికి సంబంధిత ఓట్ల వివరాలను తెలియజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణను పూర్తి చేశారన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో ప్రవేశించేవారిని పూర్తి స్థాయిలో తనిఖీ చేశాకే లోపలకు పంపాలని సిబ్బందికి సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యల గురించి ఇప్పటికే అధికారులతో సమీక్షించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీకి ఇబ్బంది పెడుతున్నారు

> రెవెన్యూ అధికారుల తీరుపై విద్యార్థుల నిరసన



యానాం రెవెన్యూ కార్యాలయానికి ధ్రువపత్రాల కోసం వచ్చిన అభ్యర్థులు

యానాం: వివిధ కోర్సుల్లో జాయిన్ అయ్యేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి రోజుల తరబడి ఆఫీసు చుట్టూ తిప్పించుకుంటున్నారని బుధవారం పలువురు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ప్రధానంగా వీఏఓ రషీద్ తీరుపై మండిపడ్డారు. ప్రస్తుతం సెంటాక్, నీట్, నాన్‌నీట్ తదితర కోర్సులకు పుదుచ్చేరి, యానాం తదితర ప్రాంతాల్లో కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అలాగే ఇంటర్, డిగ్రీ తదితర కోర్సుల్లోనూ జాయిన్ అయ్యేందుకు పలువురు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంతో పాటు సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట తదితర తీర ప్రాంత గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాల కోసం స్థానిక రెవెన్యూ ఆఫీసుకు వస్తున్నారు. అయితే సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ వేగంగా జరగకపోవడంతో సకాలంలో తాము కౌన్సిలింగ్‌కు హాజరుకాలేమోనన్న ఆందోళనను వ్యక్త పరిచారు. రోజుల తరబడి సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగితే తాము కౌన్సిలింగ్‌కు ఎప్పుడు వెళ్లాలని వారు ప్రశ్నించారు. వీఏఓ రషీద్ సర్టిఫికెట్లకు సంబంధించి పరిశీలన ప్రక్రియ చేపట్టడం లేదని, ప్రశ్నిస్తే తమపై ఏకవచనంతో మాట్లాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వీఏఓ రషీద్‌ను వివరణ కోరగా విద్యార్థులకు త్వరితగతిన సర్టిఫికెట్ల జారీకి చర్యలు తీసుకుంటానన్నారు.

మధ్యాహ్న భోజన సహాయకులకు శిక్షణ

ఐ.పోలవరం: స్థానిక మురమళ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన తయారీ సహాయకులకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.వెంకటలక్ష్మి, మండల విద్యాశాఖాధికారులు కొండారెడ్డి, కె.తిరుమలరావు, కేశనకుర్రు వైద్యాధికారి డాక్టర్ రాజేష్, రిసోర్స్‌పర్సన్ డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటలు చేసేటప్పుడు పాటించాల్సిన నియమాలు, తయారీ పద్ధతులు, పరిసరాల శుభ్రత తదితర అంశాలను చర్చించారు. అనంతరం వివిధ రకాల వంటలను తయారుచేసి ప్రదర్శించారు.

హోరాహోరీగా చదరంగం పోటీలు



పోటీల్లో చదరంగం ఆడుతున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక రోటరీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న రోటరీ యువజన వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం సాయంత్రం బాల బాలికలకు చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఇందుపల్లికి చెందిన చదరంగ క్రీడా నిపుణుడు ముద్దు రమేష్ వ్యవహరించారు. రోటరీ యువజన వారోత్సవాల కమిటీ చైర్మన్ ఆకొండి పవన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి నాగ భూషణం, కార్యదర్శి శ్రీఘాకోళపు రామ సతీష్, కోశాధికారి కూచిమంచి శశిధర్ శ్రీరామ్, రోటరీ మాజీ డిప్యూటీ గవర్నర్ వరదా మల్లిబాబు పోటీలను పర్యవేక్షించారు.

ఉపాధి పథకం రద్దు కానివ్వం



ఉపాధి కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న సుబ్బారావు తదితరులు

ఐ.పోలవరం: ప్రధాని మోడీకి కోపం వచ్చినప్పుడల్లా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేస్తామంటున్నారని, ఐక్యతతో దాన్ని రద్దు కాకుండా పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు స్పష్టం చేశారు. బుధవారం ఐ.పోలవరం, అమలాపురం ప్రాంతాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ఉపాధి కార్మికులను కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికుల పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలి రేట్లు రూ.600కు పెంచాలని, ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే ఇన్సూరెన్స్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామమూర్తి, పాము బాలయ్య, దుర్గాప్రసాద్, పాటి ఈశ్వరి, శ్రీనివాసరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వారిని లేవదీస్తున్న స్థానికులు

యానాం: పట్టణంలో బుధవారం రాత్రి 10 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక యానాం బైపాస్ రహదారి నుంచి పట్టణ ముఖ ద్వారమైన నల్ల చెరువు ప్రాంతం మీదుగా వెళుతున్న బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి అంబులెన్స్‌ను రప్పించి అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులిద్దరూ తాళ్లరేవు మండలానికి చెందినవారని, మద్యం తాగి బైక్ నడపడం వల్లే అదుపు తప్పిందని స్థానికులు తెలిపారు.

చాలీసా పారాయణ విజయవంతం చేయండి

> విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం



హనుమాన్ చాలీసా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యం

మలికిపురం: హనుమత్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీన ఉదయం 8 గంటల నుంచి అమలాపురం కాపు కల్యాణ మండపంలో ప్రారంభమయ్యే సహస్ర హనుమాన్ చాలీసా పారాయణను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, టీటీడీ ధార్మిక మండలి సభ్యులు గువ్వల నాగరాజు కోరారు. మలికిపురంలో ఇందుకూరి అచ్యుతరామరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీతారామాంజనేయస్వామి వారి పూజారి కార్యక్రమాలతో స్వామీజీల అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. అనంతరం వెయ్యి మంది భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 11 పర్యాయాలు చేస్తామన్నారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు. విశ్వహిందూ పరిషత్ దేశ వ్యాప్తంగా చేస్తున్న ఈ మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాస నగేష్, అడబాల రాంబాబు, చంపాటి శివరామకృష్ణంరాజు, కాపిశెట్టి కనకేశ్వరరావు, పట్టపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, అడబాల నరసింహారావు, పెచ్చెట్టి మురళీమోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.